సాక్షి నిర్మల్

బుధవారం ၊ 1 ၊ జనవరి ၊ 2025



అమ్మా.. కరుణించు.. 8లో▸

కెరమెరి మండలం మహారాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి ఆలయం జాతరకు ముస్తాబైంది. బుధవారం నుంచి ఈ నెల 28వరకు జాతర జరుగుతుంది.



ఎత్తిపోసేది ఎప్పుడో? 9లో▸

ఆష్ట గ్రామంలోని ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారింది. 1,500 ఎకరాల ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో నిర్మించారు. కానీ, ఇప్పటికీ లక్ష్యం నెరవేరలేదు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 30.0 / 14.0

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది. ఒకటిరెండుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా పోలీసులకు సేవా పతకాలు

నిర్మల్‌టౌన్‌: రాష్ట్ర ప్రభుత్వం పోలీసులకు సేవా పతకాలను ప్రకటించింది. జిల్లాలో ముగ్గురు పోలీసులు ఎంపికయ్యారు. నిర్మల్ పట్టణ ఎస్సై సి.అశోక్, లోకేశ్వరం ఏఎస్సై జె.దిగంబర్, డీఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ ఎల్.శంకర్‌కు పతకాలు ప్రకటించింది.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్

నిర్మల్‌టౌన్‌: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా జనవరి 1 నుంచి 31 వరకు నెలరోజుల పాటు 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు నిర్వహించరాని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ప్రజాధనానికి నష్టం కలిగేలా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదని సూచించారు. అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

అసత్య ప్రచారం చేయొద్దు..

అసత్య ప్రచారం చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున భైంసా నాగదేవత ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీని పెకిలించే క్రమంలో హుండీ సమీపంలోని టైల్స్ పగిలిపోయాని తెలిపారు. ఆలయంలో ఎలాంటి నష్టం జరుగలేదని పేర్కొన్నారు. కొంతమంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన



వీసీలో పాల్గొన్న అధికారులు, రైతులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో రైతులకు పుట్టగొడుగుల పెంపకంపై మంగళవారం అవగాహన కల్పించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులకు వీసీ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు హైదరాబాద్ నుంచి అవగాహన కల్పించారు. పుట్టగొడుగులను ఎలా పెంచాలి, ఏయే రకాలను పెంచాలి అనే అంశంపై రైతులకు సూచనలు చేశారు. పుట్టగొడుగులతో కలిగే ప్రయోజనాలను శాస్త్రవేత్తలు వివరించారు. ఇందులో ఏఈఓలు పవిత్ర, సుష్మిత, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ నటుడుగా సూర్యనారాయణ



అవార్డు స్వీకరిస్తున్న సూర్యనారాయణ

నిర్మల్‌టౌన్‌: మెగా ఎంటర్‌ప్రైజెస్ ఇండియన్ వావ్ టాలెంట్ ఐకాన్, శివనందిని -2024 అవార్డులను రవీంద్రభారతిలో మంగళవారం ప్రదానం చేశారు. నాన్న నేను అనే షార్ట్ ఫిలింలో నటించిన నిర్మల్‌కు చెందిన ముప్పిడి సూర్యనారాయణకు ఉత్తమ నటుడు అవార్డు లభించింది. ఈ సందర్భంగా నిర్మల్ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

సంకెళ్లు వేసుకుని 'సమగ్ర' ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నిర్మల్ రూరల్‌: జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె 22వ రోజుకు చేరింది. మంగళవారం చేతులకు నల్ల రిబ్బన్లు సంకెళ్ల మాదిరిగా కట్టుకుని నిరసన తెలిపారు. విద్యాశాఖలో క్రమశిక్షణతో పనిచేస్తున్న, విద్యా వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉన్న తమకు సంకెళ్లు వేయడం సరికాదన్నారు. తమని బానిసల్లా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో నాయకులు గంగాధర్, ఆనంద్, రాజారత్నం, రాము, నవిత, పోచన్న, ముత్యం, విఠల్, లింగన్న, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ.. జోష్



నిర్మల్‌లో న్యూ ఇయర్ వేడుకలకు స్పెషల్ వంటకాలు రెడీ



సంబురాల్లో విద్యార్థుల చిందులు



ఆల్ఫోర్స్ కాలేజీలో కేక్ కట్‌చేస్తున్న విద్యార్థినులు



పాటలు పాడుతున్న కళాకారులు..

ఆంగ్ల నూతన సంవత్సరం వేడుకలు జిల్లాలో అంబరాన్ని తాకాయి. 2024కు వీడ్కోలు చెప్పి.. 2025కు స్వాగతం అంటూ.. జిల్లా ప్రజలు మంగళవారం అర్ధరాత్రి వరకు సంబరాల్లో మునిగితేలారు. అర్ధరాత్రి 12 గంటలకు కేక్ కట్‌చేశారు. ఇక వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లలో స్పెషల్ ఆఫర్లతో ఫుడ్ అందించారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా ఫుడ్, స్నాక్స్ స్టాల్స్ వెలిశాయి. మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు కిటకిటలాడాయి. ఇక చాలా మంది ఇళ్లలోనే డీజేలు ఏర్పాటు చేసుకుని అర్ధరాత్రి వరకు స్టెప్పులేశారు. కేరింతలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. 12 గంటలకు హ్యాపీ న్యూ ఇయర్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

– నిర్మల్‌టౌన్‌

ఈఏడాది 'అమ్మరక్షిత'...



గతేడాది ప్రభుత్వ పథకాల అమలుతోపాటు జిల్లాలోనూ 'బాలశక్తి' వంటి వినూత్న కార్యక్రమాలను చేపట్టాం. కొత్త ఏడాది విద్య, వైద్యం, పర్యాటకరంగాలపై ప్రత్యేక దృష్టి పెడతాం. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులను కాపాడుకోవడానికి ఈఏడాది కొత్తగా 'అమ్మరక్షిత' కార్యక్రమాన్ని చేపడతాం. పదోతరగతిలో మనజిల్లా మళ్లీ స్టేట్‌ఫస్ట్ వచ్చేలా ప్రయత్నం చేస్తాం. లైవ్‌లోకేషన్ పక్కాగా అమలుచేస్తాం. జిల్లాకేంద్రంలో పార్క్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తాం.

– అభిలాష అభినవ్, కలెక్టర్

ప్రజలకు అందుబాటులో పోలీసు..



గతేడాదిలో పోలీసుశాఖ ఎన్నో కేసులను విజయవంతంగా పరిష్కరించింది. ఉన్నతస్థాయి ఒత్తిళ్లను సైతం తట్టుకుని ప్రజలపక్షాన నిలిచింది. కొత్త ఏడాదిలో మరింతగా ప్రజలకు పోలీసుశాఖ అందుబాటులో ఉంటుంది. భైంసాలోనూ క్యాంప్‌ఆఫీస్ ప్రారంభించి ప్రతీ శుక్రవారం అక్కడే ప్రజావాణి నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేశాం. వ్యసనాల బారి నుంచి యువతను కాపాడేలా కార్యక్రమాలు చేపడతాం.

– జానకీషర్మిల, ఎస్పీ

అంగన్‌వాడీల్లో మిషన్...



కొత్త ఏడాదిలో 'అంగన్‌వాడీ మిషన్' ప్రారంభించబోతున్నాం. నిర్మల్ పేరు నిలిపేలా చర్యలు చేపడతాం. అలాగే బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేలా ప్లాన్ చేస్తున్నాం. ప్రధానంగా పట్టణాల్లో వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యను సంబంధిత శాఖలతో కలిసి ఈ ఏడాదిలో క్లియర్ చేయాలనుకుంటున్నాం. ఈ ఏడాది మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమవుతున్నందున మిగిలిన పనులన్నీ పూర్తిచేస్తాం.

– ఫైజాన్‌అహ్మద్, అదనపు కలెక్టర్

కొత్త లక్ష్యంతో 2025

- 2024 అనుభవాలతో.. 2025లో లక్ష్యాన్ని చేరుదాం..
- కొలువులు కొట్టేస్తామంటున్న యువత..
- జిల్లాను కొత్తగా చూపిస్తామంటున్న అధికారులు

2025.. మరో కొత్తసంవత్సరం. ఇదిగో ఈరోజే ఆరంభం. ఇంట్లో గోడమీద కొత్త క్యాలెండర్‌తోపాటు మనలోనూ కొంగొత్త ఆశలు.. సరికొత్త లక్ష్యాలు. కాలగమనంలో ఇలా ఎన్నో ఆంగ్ల సంవత్సరాలు మారినా.. ప్రతీసారి నయాసాల్ అంటే తెలియని ఉత్సాహం.. ఈ ఏడాదిలో కొత్తగా ఏదో సాధించేయాలన్న ఆరాటం.. ప్రతిఒక్కరిలోనూ ఉంటాయి. జిల్లా కలెక్టర్ నుంచి కామన్‌మ్యాన్ దాకా అందరూ ఈ కాలంతోపాటు ఏదో మార్పు తీసుకురావాలనుకుంటారు. గత ఏడాది ఇచ్చిన అనుభవాలతో కొత్త ఏడాదిని తమకు అనుకూలంగా మలుచుకోవాలనుకుంటారు. ఈక్రమంలో మంగళవారం 'సాక్షి' జిల్లా కేంద్రంలోని కావేరి లైబ్రరీకి వెళ్లింది. 'కొత్త ఏడాదిలో ఏం సాధిస్తారు..' అంటూ యువతను పలకరించింది. జిల్లా అధికారులనూ ప్రశ్నించింది. కొత్త ఏడాదిలో వాళ్ల సరికొత్త లక్ష్యాలేంటో.. అనుకుంటున్నవేంటో వాళ్ల మాటల్లోనే..

– నిర్మల్



జిల్లాకేంద్రంలోని కావేరి లైబ్రరీలో 'సాక్షి' నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న యువతీ యువకులు

టీచర్ పోస్టు కొట్టాల్సిందే..



మొన్నటి డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే పక్కా ప్రణాళికబద్ధంగా చదవాలని తెలుసుకున్నం. ఈఏడాది పక్కాగా టీచర్ పోస్టు కొట్టేందుకు సిద్ధమవుతున్నాం.

– సాహితీ

గ్రూప్-2 సాధనే లక్ష్యం..



కొత్త ఏడాదిలో ఒకటే లక్ష్యం. గ్రూప్-2 ద్వారా మంచి ఉద్యోగాన్ని సాధించడమే. ఇందుకోసం మంచి మెటీరియల్‌తో పాటు పక్కా ప్రణాళిక ప్రకారం ఏడాదంతా కష్టపడాలనుకుంటున్నా.

–అరుణ్

క్వాలిఫై కావాల్సిందే..



గత టెట్‌ను ఫస్ట్‌టైం ఎలాంటి ప్రిపరేషన్ లేకుండా రాశాను. క్వాలిఫై కాలేదు. ఈఏడాది మాత్రం పక్కాగా చదువుతున్నాను. ఈసారి టెట్‌తోపాటు డీఎస్సీలో ఎస్జీటీ పోస్టు కొట్టాలన్నదే లక్ష్యం.

–వైష్ణవి

చెరువుల రక్షణకు చర్యలు..



గత ఏడాది ధరణి సమస్యల పరిష్కారం కోసం కృషిచేశాం. ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తిచేశాం. కొత్త ఏడాదిలో ప్రధానంగా లేక్‌కమిటీ ద్వారా చెరువుల పరిరక్షణపై దృష్టిపెడతాం. ఆక్రమణలను అరికట్టేలా చర్యలు తీసుకుంటాం.

–కిషోర్‌కుమార్, అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)

ప్రణాళికాబద్ధంగా చదివి..





డీఎస్సీ తృటిలో పోయింది. పార్ట్‌టైం జాబ్ చేస్తూ చదవడం వలన ఉద్యోగం సాధించలేకపోయాం. ఈసారి మాత్రం అలా కానివ్వం. పక్కాగా ప్రణాళికబద్ధంగా ఈ ఏడాది ప్రిపరేషన్ చేయాలనుకుంటున్నాం.

–విజయశేఖర్, శ్రీధర్

కుటుంబానికి దూరంగా ఉండి..





మేము సాధించాలనుకుంటున్న ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ఈ ఏడాది బాగా కష్టపడాలని డిసైడ్ అయ్యాం. ఇప్పటికే పిల్లలు, కుటుంబానికి దూరంగా ఉంటూ కావేరీ లైబ్రరీలో గంటలపాటు చదువుతున్నాం.

–స్వప్న, మల్లీశ్వరి

ఈసారి మిస్ కానివ్వం..





గతేడాది డీఎస్సీ కోసం చాలా ప్రిపేరయ్యాం. కానీ కేవలం 6, 7 మార్కులతోనే ఉద్యోగాన్ని కోల్పోయాం. ఈఏడాది మాత్రం మిస్ కానివ్వం. కచ్చితంగా సాధించేలా ప్రణాళికబద్ధంగా చదువుతాం.

– సాత్విక, పూజ

ఇలా మొదలెడదాం...

నిర్మల్‌ఖిల్లా: ఎన్నో మధుర జ్ఞాపకాలు.. కొన్ని విషాదాలు.. కొన్ని బాధాకర సంఘటనలతో 2024 కాలగమనంలో కలిసిపోయింది. కొత్త సంవత్సరం 2025 తమ జీవితాల్లో ఆనందాలు, సంతోషాలు వెల్లివిరియాలని కోరుకుంటున్నారు. ఆయురారోగ్యాలతోపాటు సిరిసంపదలు సమకూరాలని ఆశిస్తుంటారు. అయితే లక్ష మైళ్ల దూరమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభించాల్సి ఉంటుంది. అలా ప్రతీఅంశం ఆచరణలో పెడితేనే ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయి. కొత్త సంవత్సరంలో తమ మనసుల్లోని కోరికలు నెరవేరాలని ఆకాంక్షించే విద్యార్థులు, యువత, మధ్య వయస్కులు అనేకులు ఉన్నారు. తమ జీవన శైలిలో, ఆలోచనలో మార్పుల కోసం తీర్మానాలకు జనవరి 1ని ముహూర్తంగా భావించి వాటి ఆచరణ కోసం సన్నద్ధమవుతామని తమ అభిప్రాయాలను 'సాక్షి' తో పంచుకున్నారు..

- కాలగర్భంలోకి 2024
- కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో...
- నవ వసంతంలోకి తొలి అడుగులు
- ఆరోగ్యం, ఆర్థిక అంశాలు కీలకం..
- తొలి రోజు నుంచే నాంది పలకాలంటున్న నిపుణులు

ఆచరిస్తే అత్యుత్తమ ఫలితాలు..



2024 తొలినాళ్లలో ఆరోగ్యం పట్ల నేను తీర్మానించుకున్నవిధంగా బరువు తగ్గాలని ఆలోచనను అమలుపరిచా. ఆరోగ్యకరమైన రీతిలో క్రమపద్ధతిలో వాకింగ్, వ్యాయామాలు చేస్తూనే ఆహార నియమాలు పాటించా. తద్వారా 18 కిలోలకుపైగా బరువు తగ్గాను. అవే అలవాట్లను ఇప్పటికీ కొనసాగిస్తున్నాను. నూతన సంవత్సరంలోనూ ఇదే రీతిలో ఆరోగ్యకర జీవన విధానం, పద్ధతులను కొనసాగించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను.

– బి.ప్రత్యగాత్మ, సీనియర్ అసిస్టెంట్, వ్యవసాయశాఖ

ఆర్థిక స్వావలంబనకు అంకురార్పణ..



మహిళలకు, గృహిణిలకు ఆర్థిక స్వావలంబన ద్వారానే ఇంటి ఖర్చులు, కుటుంబ నిర్వహణ విజయవంతంగా చేపట్టవచ్చు. డబ్బుల పొదుపు అవసరమైన మేర ఆదాయ వనరులను సమీకరించుకుంటూ వెళ్లాలి. అనవసర ఖర్చులను తగ్గించుకోవాలి. కొత్త తీర్మానాలను కొత్త ప్రణాళికలను జనవరి మొదటి రోజు నుంచే అవలంబిస్తూ ముందుకు సాగుతూ మహిళా శక్తిని చాటాలి.

– ధనిమెన సుజాత, వీవోఏ, కొండాపూర్

తొలి తీర్మానమిదే..



నేను 2023 మే 6న ఎవరెస్టు బేస్ 5,364 మీటర్ల శిఖరాన్ని అధిరోహించాను. ఇందుకు ఎనిమిది రోజుల సమయం పట్టింది. 2025లో టాంజానియా దేశంలో ఉన్న కిలిమంజారో పర్వతాన్ని ట్రెకింగ్ చేసేందుకు సమాయత్తమవుతున్నాను. కొత్త ఏడాదిలో సరికొత్త లక్ష్యంతో జనవరి తొలిరోజు నుంచే లక్ష్యసాధన కోసం ఏర్పరచుకున్న తన ప్రణాళికను అమలు చేసేందుకు సన్నద్ధమవుతున్నా. యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టాలి.

– ముక్క సాయిప్రసాద్, వార్డ్ అకౌంటెంట్

ఒత్తిడికి దూరంగా ఉంటే..



ప్రస్తుతం యువతచెడు వ్యసనాలకు తొందరగా ఆకర్షితులు అవుతున్నారు. వాటికి దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, విద్యాసంస్థలు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి. మంచి అభిరుచులను అలవాట్లను పెంపొందించాలి. పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళన చెందకుండా తగిన మార్గదర్శనం చేయాల్సి ఉంటుంది. తద్వారా భవిష్యత్తులో మంచివ్యక్తిత్వం కలిగినవారిగా తయారయ్యే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ అల్లాడి సురేశ్, సైకియాట్రిస్ట్, నిర్మల్

నిర్మల్ ఉత్సవాలు విజయవంతం చేయాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్‌: నిర్మల్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్సవాల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిశోర్‌కుమార్‌తో కలిసి మంగళవారం సమీక్ష చేశారు. జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఉంటుందన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. నిర్మల్ ఉత్సవాల్లో భాగంగా నిర్మల్ చరిత్ర తెలిసేలా వివిధ శాఖల నుంచి స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ వ్యక్తులను గుర్తించి కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. నిర్మల్ చరిత్రను తెలిపేలా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. స్టాళ్లు ఏర్పాటు చేయాలనుకునేవారు 9849913071 నంబర్‌లో సంప్రదించాలన్నారు. సమావేశంలో ప్రణాళిక అధికారి జీవరత్నం, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, డీఈవో రామారావు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, లీడ్‌బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, డీఎంహెచ్‌వో రాజేందర్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీపీఆర్వో విష్ణువర్ధన్, మెప్మా పీడీ సుభాష్, తహసీల్దార్ రాజు పాల్గొన్నారు.

చిన్నారుల రక్షణకు కృషి

- అదనపు ఎస్పీ ఉపేంద్రరెడ్డి



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఉపేంద్రరెడ్డి

నిర్మల్‌టౌన్‌: చిన్నారుల రక్షణకు జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని అదనపు ఎస్పీ ఉపేంద్రరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించే ఆపరేషన్ స్మైల్‌కు సంబంధించి అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. ఎస్పీ జానకీషర్మిల ఆదేశాల మేరకు తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ సూచనలతో ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, బాల కార్మికులుగా పనిచేస్తున్న చిన్నారుల సమస్యలను పరిష్కరించడం, అక్రమ రవాణాకు గురైన చిన్నారులను రక్షించడం, వారికి పునరావాసం కల్పించి చట్టపరమైన హక్కులు కల్పిస్తామని వివరించారు. పిల్లల హక్కులను కాపాడేందుకు పోలీస్ విభాగం ఇతర విభాగాలతో కలిసి బృందాలుగా ఏర్పడి రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఫ్యాక్టరీలు, వాణిజ్య సంస్థల్లో బాల కార్మికులుగా పనిచేస్తున్న పిల్లలను గుర్తిస్తుందని తెలిపారు. పిల్లల భవిష్యత్తును రక్షించడం ద్వారా సమాజంలో ఒక శక్తివంతమైన మార్పును తీసుకురావచ్చని పేర్కొన్నారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ వాహిద్, నాగలక్ష్మి, ఎస్సైలు ప్రదీప్, నరేశ్, లేబర్ అధికారి, ఏసీడీపీవో, షీటీం మహిళా ఎస్సై సుమాంజలి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని బడ్‌గాం గ్రామానికి చెందిన బోస్లే పులాజీ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మాలిక్ కథనం ప్రకారం.. బోస్లే పులాజీ (51) గత రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అప్పటినుంచి మానసికంగా బాధపడుతూ జీవితంపై విరక్తి చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం ఉరేసుకున్నాడు. కుటుంబీకులు అందించిన సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

చిరుతపులి దాడిలో ఆవు మృతి

తలమడుగు: చిరుతపులి దాడిలో ఆవు మృతిచెందింది. మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన నలుగురు రైతులకు చెందిన 30 ఆవులను మేత కోసం కూలీలు సోమవారం ఉదయం మేత కోసం నందిగ్రామ సమీపంలోని అటవీప్రాంతానికి తీసుకెళ్లారు. సాయంత్రం వరకు 29 ఆవులు రాగా, ఒకటి రాలేదు. కూలీలు అటవీ ప్రాంతంలో వెతకగా మంగళవారం ఆవుకు గాయాలై మృతిచెందినట్లు గుర్తించారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్ఆర్వో పుండలిక్, గు డిహత్నూర్ ఎఫ్ఎస్ఓ ఇమ్రాన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిరుత పులి దాడి చేసినట్టు గుర్తించారు. మృతి చెందిన ఆవు విలువ దాదాపు రూ.30 వేలు ఉంటుందని, అధికారులు నష్టపరిహారం అందించాలని బాధిత రైతు ముడుపు కేదరేశ్వర్ రెడ్డి కోరాడు.

అనుమతి లేకుండా వెళ్లిన ఇద్దరిపై కేసు

జన్నారం: జన్నారం అటవీరేంజ్ కోర్ ఏరియా ప్రాంతంలో రాత్రివేళ అనుమతి లేకుండా రెండు వాహనాల్లో వెళ్లిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు జన్నారం రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. ఆమె తెలిపిన వివరాలు.. రాత్రిసమయంలో నిబంధనలు అతిక్రమించి ఈనెల 29న జన్నారం అటవీ రేంజ్ పరిధిలోని గేటు నెంబర్ 1 నుంచి బైసన్‌కుంట వరకు సంతోష్, మహేందర్‌లు రెండు కార్లలో వెళ్లారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి, వారి వాహనాలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.


ముస్తాబైన అమ్మవారి ప్రాంగణం


పవిత్ర స్నానాలు చేసే కొలను

అమ్మా.. కరుణించు..

- వనక్షేత్రంలో జంగుబాయి దేవత
- నేటి నుంచి నెలపాటు జాతర
- ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి

కెరమెరి(ఆసిఫాబాద్): తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు వివాదాస్పద ప్రాంతమైన కెరమెరి మండలం ముకదంగూడ గ్రామపంచాయతీ పరిధి మహారాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి ఆలయం జాతరకు ముస్తాబైంది. బుధవారం నుంచి ఈ నెల 28వరకు జాతర ఉత్సవాలు కొనసాగుతాయి. నెలపాటు ఆదివాసీల ఆరాధ్యదైవం.. అమ్మవారి ఆలయం జనసంద్రం కానుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏర్పాట్లు చేస్తుండటంతో భక్తుల సంఖ్య పెరగనుంది. ఇప్పటికే రోడ్డు సౌకర్యం కల్పించారు. మహరాజ్‌గూడ అడవుల్లోని బోరు నుంచి పైపుల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించనుండగా.. హాల్, పోచమ్మ ఆలయానికి రంగులు వేశారు. 20 సోలార్ విద్యుత్ లైట్లు అమర్చారు. ఆలయ వరకు సీసీ రోడ్డు వేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో ఏరోజుకారోజు పారిశుధ్య నిర్వహణ పనులు చేపడుతున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.40 కోట్లతో అభివృద్ధి చేయడం గమనార్హం. ఈ సంవత్సరం జంగుబాయి ఉత్సవాలపై ప్రత్యేక దృష్టి సారించింది. తాగునీటితో పాటు రోడ్డు, మరుగుదొడ్ల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం, ప్రత్యేక పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించింది. ఇటీవల జంగుబాయి ఉత్సవాలపై హట్టిలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా పత్యేక సమావేశం నిర్వహించి ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఎనిమిది గోత్రాలు ఒకే వేదికపై..

వివిధ రాష్ట్రాల్లో ఉన్న జంగుబాయి వారసులైన వెట్టి, తుంరం, కొడప, రాయిసిడాం, సలాం, మరప, హెర్రకుంరం, మండాడి గోత్రాలకు చెందిన వేలాది కుటుంబాలు మొక్కులు చెల్లించుకుంటారు. ఎనిమిది గోత్రాలకు చెందిన కటోడాలు పుజారులుగా వ్యవహరిస్తారు. వనక్షేత్రంలో బస చేసిన పోచమ్మతల్లికీ మొక్కు తీర్చుకుంటారు. ఆలయ ప్రాంగణంలో నైవేద్యాలు తయారు చేస్తారు. సంప్రదాయ వాయిద్యాలతో గుహలోపలికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడున్న మైసమ్మ, పోచమ్మ, రావుడ్ దేవతల వద్ద మేకలు, కోళ్లు బలిచ్చి మొక్కు తీర్చుకుంటారు. రాత్రి భోజనాల అనంతరం సంప్రదాయ నృత్యాలు చేస్తారు.


జంగుబాయి గుహ

ప్రభుత్వ గుర్తింపుతో అభివృద్ధి

ఏడేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం జంగుబాయి ఉత్సవాలకు గుర్తింపునిచ్చింది. ఏటా అభివృద్ధి కోసం రూ.10 లక్షలు విడుదల చేస్తోంది. ఈ నిధులతోనే భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తారు. పూజాసామగ్రికి వెచ్చిస్తారు. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలకు చెందిన అనేకమంది ఆదివాసీలు రానున్నారు. తారురోడ్డు సౌకర్యం లేకున్నా రాళ్లు, రప్పలు, దుమ్ము, ధూళిలోనూ కొందరు కాలినడకన వస్తే.. మరికొందరు ఎడ్ల బండిపై వస్తారు. సుమారు వెయ్యికిపైగా ఎడ్లబండ్లు రావచ్చని నిర్వాహకుల అంచనా. పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తారు.


పోచమ్మ ఆలయంలోని ప్రతిమలు

ఇలా వెళ్లాలి..

జంగుబాయి పుణ్యక్షేత్రానికి కెరమెరి మండలంలోని అనార్‌పల్లి మీదుగా ఉమ్రి వంతెన నుంచి పరందోళి మీదుగా, లేదా పరందోళి సమీపం నుంచి ముకదంగూడ గ్రామానికి ఆనుకుని ఉన్న కచ్చా రోడ్డుపై వెళ్లవచ్చు. నార్నూర్ క్రాస్ రోడ్డు నుంచి కొత్తపల్లి మీదుగా, ఆదిలాబాద్ నుంచి లొకారి మీదుగా కూడా జంగుబాయికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఉంది.

సౌకర్యాలు కల్పించాం

జంగుబాయి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాం. ముకదంగూడ అడవుల్లోని బోరు నుంచి పైపులు బిగించి నీటిని సరఫరా చేస్తాం. పారిశుధ్య నిర్వహణకు గ్రామపంచాయతీ సిబ్బందిని నియమించాం. నెలపాటు వారు ఇక్కడే ఉండి ఆలయ ఆవరణను శుభ్రంగా ఉంచుతారు.

– అమ్జద్‌పాషా, ఎంపీడీవో

గుహలోనే దేవత..

జంగుబాయి దేవత గుహలో బస చేసి ఉంది. గుహ కావడంతో అక్కడికి భక్తులు కూర్చునే వెళ్తారు. చీకట్లో వెలుగుతున్న దీపం రూపంలో అమ్మవారు దర్శనమిస్తుంది. కోరికలు తీర్చే తల్లిగా ఆదివాసీలు విశ్వసిస్తారు. పుష్యమాసం నుంచి అమావాస్య వరకు జాతర కొనసాగుతుంది. ఇక్కడికి వచ్చే భక్తులు నియమనిష్ఠలతో పాదరక్షలు లేకుండానే నడుస్తూ వస్తారు. నెలపాటు కటిక నేలపైనే పడుకుంటారు. దీపారాధనతో ప్రారంభమయ్యే ఈ జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.


అమ్మవారి గుహలో వెలుగుతున్న దీపం

28 వరకు జాతర



బుధవారం నుంచి జంగుబాయి ఉత్సవాలు ప్రారంభమై ఈ నెల 28వరకు కొనసాగుతాయి. ఆలయ ప్రాంగణంలో తెలంగాణ–మహారాష్ట్ర ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పిస్తున్నాయి. రహదారికి ఇబ్బంది లేకుండా బీటీ రోడ్డు వేశారు. విద్యుత్ సౌకర్యం కూడా ఉంది. సోలార్ లైట్లు అమర్చారు.

– మరప బాజీరావు, అలయ కమిటీ గౌరవాధ్యక్షుడు

నాగదేవత ఆలయంలో చోరీ


ఆలయంలో చిందరవందరగా ఉన్న దృశ్యం


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

భైంసాటౌన్: పట్టణ శివారులోని భోకర్ రోడ్‌లో గల నాగదేవత ఆలయంలో మంగళవారం ఉదయం గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో దేవత విగ్రహంతోపాటు హుండీ చిందరవందరగా ఉండడం, టైల్స్ పగిలి ఉండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పట్టణ సీఐ గోపినాథ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలతో ఆధారాలు సేకరించారు. విషయం తెలుసుకున్న హిందూ సంఘాల నాయకులు పలువురు ఆలయానికి చేరుకుని పరిశీలించారు. దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కాగా, ఆలయంలో పగిలిన టైల్స్‌కు మరమ్మతుకు ఇసుక, టైల్స్ తీసుకురాగా, పలువురు హిందూ సంఘాల నాయకులు అడ్డుకున్నారు. దుండగులను అదుపులోకి తీసుకున్న తర్వాతే చేపట్టాలని వాపోరారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

ఆలయంలో హుండీ పగులగొట్టిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆలయంలో చోరీ ఘటన విషయం తెలుసుకుని వెంటనే స్పందించారు. హిందూ దేవాలయాల్లో ఇటీవల ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయని, పోలీసులు సమగ్ర విచారణ జరపాలని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై ఎస్పీ జానకీ షర్మిలతో మాట్లాడినట్లు పేర్కొన్నారు.

అదుపులో ఇద్దరు అనుమానితులు : ఏఎస్పీ అవినాష్‌కుమార్

ఆలయంలో చోరీ ఘటనకు సంబంధించి కేసు నమోదైనట్లు ఏఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. హుండీ పగులగొట్టే క్రమంలో ఆలయ ఆవరణలో టైల్స్ పగిలి ఉంటాయన్నారు. ఎలాంటి పుకార్లు నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

పట్టపగలే చోరీ

ముధోల్: మండల కేంద్రంలోని సాయిమాధవ్‌నగర్‌లో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. డి.సాయినాథ్, భార్య అమృత దంపతులు. సాయినాథ్ టైలర్‌గా, అమృత అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. సాయినాథ్ బైక్‌పై తన భార్యను మధ్యాహ్నం 12 గంటలకు అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లాడు. ఆ సమయంలో లగ్జరీ ఖరీదు చేసే కారులో వచ్చిన దుండగులు ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టారు. లోనికి చొరబడి 4 తులాల బంగారం, 50 తులాల వెండి, రూ.40 వేల నగదును ఎత్తుకెళ్లి పారిపోయారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు భార్యభర్తలకు వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఈవిషయాన్ని ఎస్సై సంజీవ్‌కు సమాచారం అందించారు. ఆయనతోపాటు సీఐ మల్లేశ్, క్లూస్‌టీం సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్ సిబ్బందితో తనిఖీ చేశారు. సాయినాథ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


పరిశీలిస్తున్న పోలీసులు

ఎడ్లబండిపై ఊరేగించి..వీడ్కోలు పలికి

- హెచ్‌ఎంకు వీడ్కోలు పలికిన అర్లి (టి) విద్యార్థులు

తాంసి: భీంపూర్ మండలం అర్లి(టి) పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు మంగళవారం హెచ్‌ఎం దంపతులను ఎడ్లబండిపై ఊరేగించి వీడ్కోలు పలికారు. హెచ్‌ఎం పట్ల వారికున్న అభిమానాన్ని చాటుకున్నారు. పాఠశాల ఆవరణలో ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. పిల్లల అభ్యున్నతికి హెచ్‌ఎం కృషిచేశారని, ఆయన సేవలను కొనియాడారు. వీడ్కోలు కార్యక్రమంలో పాఠశాలకు హెచ్‌ఎం..తన వంతుగా రూ.2 లక్షల విలువ గల కంప్యూటర్, వాటర్ కూలర్‌తో పాటు ఆర్వో ప్లాంట్, సౌండ్ సిస్టం విరాళంగా అందించారు. పలువురు విద్యార్థులకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్ సైతం అందజేశారు.


ఎడ్లబండిపై హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి దంపతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

రెండో అంతస్తు పైనుంచి పడి మహిళ మృతి

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ నగర పరిధిలోని బోర్గాం (పి) గ్రామంలో ఓ మహిళ ప్రమాదవశాత్తు రెండో అంతస్తు పైనుంచి పడి మృతిచెందింది. నిజామాబాద్ నాలుగోటౌన్ ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేటకు చెందిన కాలూరి నిహారిక (32)కు బోర్గాం నివాసి విజయ్‌కుమార్‌తో 2007లో వివాహమైంది. వీరికి ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిహారికకు కొన్నేళ్లుగా ఆరోగ్యం, మానసికస్థితి బాగాలేదు. మంగళవారం మధ్యాహ్నం దుస్తులు ఆరేయడానికి రెండో అంతస్తు పైకి వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడిపోయింది. తీవ్రగాయాలైన ఆమెను స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలి అన్నయ్య మురళి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


నిహారిక మృతదేహం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కుంటాల మండలం మెదన్‌పూర్ గ్రామానికి చెందిన భోజారం తన బంధువు సిద్దేశ్వర్‌తో కలిసి బైక్‌పై భైంసా వెళ్తున్నారు. అదే సమయంలో భైంసా నుంచి నిర్మల్‌వైపు వెళ్తున్న లారీని వానల్‌పాడ్ వద్ద బైక్ ఎదురుగా వెళ్లి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భోజారం, సిద్దేశ్వర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను అంబులెన్సులో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని గణేష్‌పూర్‌కు చెందిన చిక్రం అర్జున్ (19) రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. టూటౌన్ ఏఎస్సై ముకుంద్ రావు కథనం ప్రకారం..అర్జున్ గత కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన ఏ పనిచేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. దీంతో కుటుంబీకులు మందలించడంతో గతనెల 28న ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని పేర్కొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

బోథ్: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి బైక్ ఇటీవల చోరీకి గురైంది. మండల కేంద్రానికి చెందిన బైక్ దొంగ విష్ణును మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విష్ణును రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నేడు, రేపు సీసీఐ కొనుగోళ్ల నిలిపివేత

భైంసాటౌన్: పట్టణంలో బుధ, గురువారాల్లో సీసీఐ కొనుగోళ్లు నిలిపేస్తున్నట్లు ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పూర్యానాయక్ తెలిపారు. ఆంగ్ల నూతన సంవత్సరం నేపథ్యంలో పత్తి కొనుగోళ్లు జరుపడం లేదని పేర్కొన్నారు. 3వ తేదీన కొనుగోళ్లు తిరిగి ప్రారంభిస్తామని వెల్లడించారు.